శ్రీలలితా త్రిపుర సుందరిగా గంగమ్మ




లలితా త్రిపుర సుందరీగా తాతయ్యగుంట గంగమ్మ, గరుడ వాహనంపై చంద్రగిరి మూలస్థానమ్మ

తిరుపతి కల్చరల్/చంద్రగిరి/తిరుపతి రూరల్ : దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం తాతయ్యగుంట గంగమ్మ శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా, కొత్తవీధిలో వున్న కన్యకా పరమేశ్వరి కామాక్షిదేవిగా, బొంతాలమ్మ అభిరామ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చంద్రగిరి గ్రామ దేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ నారాయణి అవతారంలో గరుడ వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనం కల్పించారు. తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీ స్టాఫ్ క్వార్టర్స్ వద్ద వున్న కరుమారియమ్మ లలితా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు.



లలితా త్రిపుర సుందరిగా కరుమారియమ్మ



బ్రహ్మోత్సవ సంబరం

తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో శనివారం ఉదయం స్వామి వారు కల్పవృక్ష వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. వాహన సేవ సందర్భంగా టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో 9 రాష్ట్రాల నుంచి 18 కళాబృందాల్లో 513 మంది కళాకారులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కల్పవృక్ష వాహన సేవ సందర్భంగా డాక్టర్ చిత్రకూరి శివరామకృష్ణ శర్మ రచించిన వైదిక విజ్ఞానం, డాక్టర్ పులికొండ సుబ్బాచారి రచించిన జానపదలు ఆధ్యాత్మికత, ఆచార్య భోగరాజు పార్వతి రచించిన ఆనంద నిలయం పుస్తకాలను టీటీడీ చైర్మన్ ఆవిష్కరించారు.






నేటి వాహన సేవలు

తిరుమల: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజు ఆదివారం ఉదయం శ్రీవారు మోహినీగా భక్తులకు దర్శనమిస్తాడు. రాత్రి మలయప్పస్వామివారు గరుడ వాహనంపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తారు.

శ్రీవారికి గొడుగుల సమర్పణ

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడ సేవ కోసం చెన్నైకి చెందిన హిందూ ధర్మార్థ సమితి తరపున ఆర్ఆర్.గోపాల్ జీ 9 గొడుగులను సమర్పించారు. వాటిని శనివారం టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌కు అందజేశారు.



శ్రీవారికి శ్రీవిల్లిపుత్తూరు మాలలు

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడ సేవలో స్వామివారికి అలంకరించేందుకు తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరు నుంచి గోదాదేవి మాలలు శనివారం తిరుమలకు చేరుకున్నాయి. వాటిని ముందుగా బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్ద వున్న పెద్దజీయంగార్ మఠానికి తీసుకొచ్చారు. అక్కడ తిరుమల పెద్దజీయంగార్, చిన్న జీయంగార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.



కల్యాణ వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

చంద్రగిరి: పెరటాసి మాసం రెండవ శనివారం కావడంతో శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అలాగే వారపు ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం స్వామివారు బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిచ్చారు.

రోడ్డు ఏర్పాటు చేయాలని వినతి

పాకాల : తమ గ్రామానికి రోడ్డు వేయాలని మద్దినాయనపల్లి హరిజనవాడ, గోకులాపురం ఎస్టీ కాలనీ వాసులు కోరారు. వారు రోడ్డు సౌకర్యం కల్పించాలని 2024 ఆగస్టులో ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో డీపీవో సురేష్‌నాయుడు విచారణకు విచ్చేశారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈఓపీఆర్డీ శశిరేఖ, పీఎస్ అనురాధ పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్నకు సారె సమర్పణ




సారె తెస్తున్న తిరుపతి రూరల్, చిన్నగొట్టిగల్లు మండలాల భక్తులు

తిరుపతి రూరల్ : కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజు శనివారం ఉదయం కల్పవృక్ష వాహనం నిర్వహించారు. తుమ్మలగుంట పంచాయతీ కేవీఎస్ నగర్ వాసులు, చిన్నగొట్టిగల్లు మండల వాసులు సారె సమర్పించారు. వారికి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి స్వాగతం పలికారు.




సారె తీసుకువస్తున్న తుమ్మలగుంట వాసులు

మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యం నిర్వహణకు సహకారం

తిరుపతి సిటీ: చిన్న మున్సిపాలిటీల్లో మెరుగైన పారిశుద్ధ్యం నిర్వహణకు సహకారం అందిస్తామని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.మౌర్య తెలిపారు. ఆమె శనివారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా కుప్పం, మడకశిర, మైదుకూరు, కమలాపురం, జమ్మలమడుగు మున్సిపాలిటీల కమిషనర్లతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆమె మాట్లాడుతూ తిరుపతిలో స్వచ్ఛ భారత్ మిషన్‌లో ప్రజల్లో అవగాహన కల్పించి వంద శాతం చెత్త నిర్వహణను చేసినట్టు తెలిపారు. ఇక్కడ చేసినట్టుగానే ఐదు మున్సిపాలిటీల్లో పనులు చేసేలా సహకారం అందించి స్వచ్ఛ సర్వేక్షన్‌లో ఉత్తమ ప్రతిభ కనపరిచేలా చేస్తామని తెలిపారు. అనంతరం తూకివాకం వద్దనున్న చెత్త నిర్వహణ కేంద్రాన్ని కమిషనర్లు పరిశీలించారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.









ముగిసిన వ్యక్తిత్వ వికాస శిక్షణ

చంద్రగిరి: శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ శనివారం ముగిసింది. కళాశాల అసోసియేట్ డీన్ రెడ్డిశేఖర్ మాట్లాడుతూ ఈ శిక్షణ భవిష్యత్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

తరగతుల నిర్వహణపై ఫిర్యాదు

తిరుపతి సిటీ: ఇంటర్మీడియట్ బోర్డు దసరా సెలవులు ఇచ్చినప్పటికీ తిరుపతి జిల్లా లోని కొన్ని కార్పొరేట్ సంస్థలు తరగతులు నిర్వహించడం దారుణమని ఎస్ఎఫ్ఐ నేతలు ఆరోపించారు. వారు శనివారం ఆర్ఐవో కార్యాలయ ఏవోకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తేజ, సభ్యులు పాల్గొన్నారు.

స్విమ్స్ వైద్యుడికి నివాళి

తిరుపతి తుడా: ఇటీవల గుంటూరులో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన స్విమ్స్ జనరల్ సర్జరీ విభాగం డాక్టర్ వెంకట కిషోర్‌కు వైద్య బృందం, సిబ్బంది శనివారం ఘనంగా నివాళులర్పించారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్, రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా, డీన్ అలోక్ సచిన్ ఆయన సేవలను కొనియాడారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

తిరుమల: తిరుమలలో శనివారం చక్రధర్ అనే యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. తిరుమలలో తన స్నేహితుడు పనిచేస్తున్న దుకాణంలో బ్యాగ్ ఉంచి బయటకువెళ్లాడు. జీఎన్సీ టోల్‌గేట్ వద్ద బ్లేడుతో మెడపై కోసుకున్నాడు. స్థానికులు అతడిని టీటీడీ అశ్విని ఆసుపత్రికి తరలించారు. అతడి పూర్తివివరాలు తెలియరాలేదు.

ఒంటరి ఏనుగు హల్‌చల్

పాకాల: మండలంలోని పదిపుట్లబైలు పరిసర ప్రాంతాల్లో శనివారం ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. దారి తప్పిన ఒంటరి ఏనుగు పుల్లావాండ్లపల్లి నుంచి కల్లూరు హైవే పరిసర ప్రాంతాల్లో తిరుగుతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు తెలిపారు.





